**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

**సంప్రదించ వలసిన నెంబర్:**
**7095999737,9908103501**



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:01 ఎడిటర్: రాపోలు లింగస్వామి 26 -08 -2026 బుధవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


### పర్యావరణహితంగా

## గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. గణేష్ ఉత్సవాలతోనే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమానికి గణేష్ ఉత్సవాలు ఎంతో ఊతమిచ్చాయని, ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణకు కూడా అవి దోహదపడాలని అన్నారు. నగరంలోని చెరువులను కాలుష్యరహితంగా మార్చేందుకు హైడ్రా చర్యలు చేపడుతోందని తెలిపారు. చెరువుల ఆక్రమణలను తొలగిం చడంతో పాటు, మురికికూపాలుగా మారిన చెరువుల్లో పూడికను తొలగించి వాటిని మంచినీటి సరస్సులుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా ఎస్‌టీపీలు (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని చెరువుల వద్ద బేబీ పాండ్లను నిర్మిస్తు న్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పర్యావరణహితమైన మట్టి గణేష్ విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్న గణేష్ విగ్రహాలను ఇప్పటికే చాలామంది మట్టితో తయారు చేసుకుంటున్నారని, అదే విధంగా ఉత్సవాల ఊరేగింపులకు ఉపయోగించే పెద్ద విగ్రహాలను కూడా మట్టితో తయారు చేసేలా నిర్వాహకులు

2 వ పేజీలో ..

### మూసీ ప్రాజెక్ట్ భూసేకరణను

## వేగవంతం చేయండి..

**సీఎం రేవంత్ ఆదేశాలు**



హైదరాబాద్, ఆగస్టు 25: మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొం దించుకోవాలన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్‌లను పిలవాలని ఆదేశించారు. ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. మంగళవారం ఆ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, ఊటీఆం కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఉఊఓఅ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఫీజు బకాయి బిజెపి లడాయి

### నిరాహార దీక్షలో పాల్గొన్న

**మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ**



మెదక్,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు25 :భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తలపెట్టిన ఫీజు బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ పాల్గొని సంఘీభావం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. దీక్షలో కిసాన్ మోర్చా కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో పాల్గొన్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు బకాయిలు విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేస్తు న్నామన్నారు. లేని ఎడల బిజెపి పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం జరుగుతుందనీ ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కమిటీ జనరల్ సెక్రటరీ ఆకుల ప్రభాకర్, శ్యామ్,రమేష్, ఉపాధ్యక్షుడు రాజు, శ్రీనివాస్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు చంద్రన,కార్తీక్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు బాల్ లింగం,శ్రీకాంత్ మెదక్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు గోవిందరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు



న్యూఢిల్లీ, జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 25, 2026:తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య , కమిషన్ సభ్యులతో కలిసి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి గౌరవ శ్రీ జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల భూములకు సంబంధించిన పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులకు సంబంధించిన భూ హక్కులు, భూముల పరిరక్షణ, భూ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు జాతీయ స్థాయిలో పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అనేక మంది ప్రజలు తమ భూముల విషయంలో వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని, సంబంధిత అంశాలపై రాష్ట్ర స్థాయిలో చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొన్ని సమస్యలకు కేంద్ర స్థాయిలో కూడా పరిష్కారం అవసరమని ఆయన కేంద్ర మంత్రి కి వివరించారు. దళిత, గిరిజన కుటుంబాలకు భూమి కేవలం ఆస్తి మాత్రమే కాకుండా వారి జీవనోపాధికి, ఆర్థిక భద్రతకు మరియు భవిష్యత్ తరాల అభివృద్ధికి కీలక ఆధారమని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సంబంధిత కేంద్ర శాఖలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ని కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు కోరారు. అదేవిధంగా, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, భూ రక్షణకు సంబంధించిన చట్టాలు సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా విని, దళిత, గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి,సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ,చైర్మన్ ఖూ భారత్,ఎస్సీ ఎస్టీ పిఓ యాక్ట్ మెంబర్ బిట్ల వెంకటేశ్వర్లు,దుబ్బాక నవీన్,చేతన్,పాల్గొని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల భూ సమస్యలు మరియు వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### టీపీయూఎస్ ఆధ్వర్యంలో

## ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం.




చిట్యాల, నల్లగొండ, జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 25: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం స్టేట్ అకాడమిక్ సెల్ కన్వీనర్ బుర్రి గోపాల్‌రెడ్డి తెలిపారు. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, ఉరుమడ్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన టీపీయూఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వాలను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బుర్రి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం టీపీయూఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 26న నల్లగొండలోని రత్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న 'గురువందనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు కంచనపల్లి విజయ్‌కుమార్, మిర్యాల మురళి, బూరుగు వెంకటేశ్వర్లు, పులిమామిడి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### "ప్రజల భూములను 22-ఏలో నిషేధిస్తే..

## ప్రజలు నిన్ను నిషేధిస్తారు!

**"అకారణంగా 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన కుత్బుల్లాపూర్ భూములను వెంటనే తొలగించాలి.**

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.. తప్పు చేసిన వారిని శిక్షించాలి: తన్నీరు హరీష్ రావు...**

**22-ఏ బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని భూములను అకారణంగా 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అర్హులైన భూ యజమానుల భూములను 22- ఏ జాబితా నుంచి తొలగించాలని మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఎం.జే. గార్డెన్స్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 22- ఏ బాధితుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హరీష్ రావు , ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు , గోరేటి వెంకన్న , ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి , మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణలో 22- ఏ సమస్య కేవలం రిజిస్ట్రేషన్ సమస్య కాదు.. వేలాది మంది భూ యజమానుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య" అనిఅన్నారు .ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, చట్టబద్ధమైన పత్రాలు, పట్టాలు కలిగి ఉండి, పన్నులు చెల్లిస్తున్న ప్రజల భూములను ఒక్కసారిగా 22- ఏ జాబితాలో చేర్చడం వల్ల వారు తమ భూములను అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**"22- ఏ అంటే కేవలం ఒక నంబర్ కాదు.. ఒక కుటుంబం భవిష్యత్తుపై పడే తాళం!"**

ఒక కుటుంబం తన భూమిని అమ్మి పిల్లల చదువుకు ఖర్చు చేయవచ్చు, కూతురి వివాహం చేయవచ్చు, వ్యాపారం ప్రారంభించవచ్చు, అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భరించవచ్చు, ఇల్లు నిర్మించుకోవచ్చని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రజల భూములను నిషేధిస్తే.. ప్రజలు నిన్ను నిషేధిస్తారు" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.**

22- ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా

2 వ పేజీలో ..

# సంపాదకీయం

## 22-ఏ కల్లోలం

'ఏం చేస్తున్నావు కోడలా అంటే పారబోసి ఎత్తుకుంటున్నా అత్తా' అన్నదట. గత రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన అంతా ఇదే తీరుగా సాగుతున్నది. తప్పులు చేయడం, కోర్టులు మొట్టికాయలు వేయడమో, ప్రజాగ్రహం పెల్లుబుకడమో జరిగితే దిద్దుబాట పట్టడం సాధారణమైపోయింది. తాజాగా తెరపైకి వచ్చిన 22-ఏ వివాదం అందుకు నిలువెత్తు నిదర్శనం. దీనిని వివాదం అనడం కన్నా ప్రజల జీవితాలతో చెలగాటంగానే చూడాలి. ఎందుకంటే రియల్ ఎస్టేట్ రంగంలో 22-ఏ సృష్టించిన కల్లోలం ఇంతా అంతా కాదు. ఇప్పటికే హైడ్రా వంటి దుందుడుకు, దుస్సాహసిక విధానాలతో సర్కార్ రియల్ వ్యాపారాన్ని కుప్పకూల్చింది. ఎక్కడ ప్లాటు కొనాలన్నా, ఫ్లాటు బుక్ చేయాలన్నా గుబులే అనే పరిస్థితి తెచ్చింది. అక్రమ నిర్మాణాల పేరిట యంత్రభూతాలు పేదల ఇండ్లపై చేస్తున్న కరాళనృత్యం కొనుగోలుదార్లను భయభ్రాంతులను చేసింది. స్వరాష్ట్ర సాధన తర్వాత కళకళలాడిన రియల్ రంగం ఇప్పుడు మూలన పడి మూలుగుతున్నది.

దానికి తోడైన 22-ఏ సంక్షోభం ఆ రంగాన్ని చావుదెబ్బ తీసింది. చిన్నచెక్క సర్కారీ భూమి ఉంటే యావత్తు సర్వే నంబరును నిషేధిత జాబితాలో తోసేయడం వల్ల తలెత్తిన సమస్య ఇది. రిజిస్ట్రేషన్‌కు వెళ్లిన అనేకమందికి సదరు ఆస్తి నిషేధిత జాబితాలో ఉన్నట్టు కంప్యూటర్ ఎర్రగుర్తు చూపడంతో దిక్కుతోచని స్థితి. ఈ ఎర్రగుర్తులున్న సర్వే నంబర్లకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు సబ్ -రిజిస్ట్రార్లు నిరాకరిస్తున్నారు. అధికారులు చేతులెత్తేస్తుంటే సర్కార్ పొంతన లేని ప్రకటనలతో గందరగోళాన్ని పెంచుతున్నది. ప్రభుత్వం కలగాపులగంగా భూముల వివరాలు ఆన్‌లైన్ చేయడంతో అవి తప్పులతడకలుగా మారి సాంకేతిక సమస్యలు సృష్టిస్తున్నాయి. పిల్లల చదువుల కోసమో, పెండ్లిళ్ల కోసమో అమ్మేసుకుందామని వెళ్లిన సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొనుగోలుదార్లకు ఏ ఆస్తి నిషేధిత జాబితాలో ఉన్నదో తెలియని పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న రిజిస్ట్రేషన్లు అడుగంటిపోయాయి.

మొన్నటిదాకా ప్రధానంగా రాజధాని, చుట్టుపక్కల ప్రాంతాలకు పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు జిల్లాలకు పాకినట్టు కనిపిస్తున్నది. ఈలోగా సర్కార్ రోజుకోరకం కుప్పిగంతులు వేస్తున్నది. అధికారులపైకి నెపం నెడుతున్నది. ఈలోగా రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి. బ్యాంకు రుణాలు తిరస్కరణకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సర్కార్ మాత్రం రైల్వే అనౌన్స్‌మెంట్ తరహాలో అసౌకర్యానికి చింతిస్తున్నాం అంటూ సారీలతో సరిపెడుతున్నది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన 22-ఏ టోల్ ఫ్రీ నంబరులో ఇప్పటికే వందలాదిగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారమే దాదాపు వెయ్యి ఫిర్యాదులు నమోదయ్యాయి. నిషేధిత జాబితా ప్రక్షాళన వేగంగా చేపట్టినట్టు ప్రభుత్వం చెప్పుకొస్తున్నది. ముందుగా చితకబాది, ఆపై క్షమాపణలు చెప్పి, తాపీగా మలాము రాస్తున్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ సర్కార్ ధోరణి.

ఇది కేవలం అసమర్థత వల్ల జరిగిన అనర్థమని అనుకోవడానికి వీల్లేదు. భారీ స్థాయిలో కింది నుంచి పైస్థాయి దాకా అవినీతికి ద్వారాలు తెరిచేందుకే ఈ సమస్య కావాలని సృష్టించారని విపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించుకోవాలంటే అధికారుల చుట్టూ తిరగాలి. వారు ప్రసన్నులైతేనే భూమికి మోక్షం. ఫిర్యాదు చేయాలి. తర్వాత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత అధికారులను కలుసుకోవాలి.

తమ భూమి తమదేనని రుజువు చేసుకునేందుకు ఈ తతంగమంతా చేయడమే కాకుండా అధికారుల చేతులు తడపాల్సి వస్తున్నదని బాధితులు వాపోతున్నారు. పెద్దగా సమస్య లేదన్నట్టుగా మాట్లాడుతూనే, యుద్ధప్రాతిపదికపై దిద్దుబాట్లు చేపడుతున్నట్టు చెప్పడం తిరకాసు కాక మరేమిటి? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ భూముల మీదే తదేక దృష్టి నిలుపడం తెలిసిందే. సర్కారీ భూముల వేటలో సామాన్యులు సమిధలవుతుడటం విచారకరం. ప్రైవేట్ భూములు అలా నిషేధిత జాబితాకెక్కడానికి ఎవరు బాధ్యులు?

అధికారులా, మంత్రులా? ఈసరికే ప్రజలు అనుభవించిన క్షోభకు ఎవరు జవాబుదారీ వహిస్తారు? అనేది ప్రశ్న. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించి నిగ్గుతేల్చాలి.

అలా చేయకపోతే పాలకుల దగ్గర దాచాల్సింది చాలానే ఉన్నట్టు భావించాల్సి వస్తుంది.

## కుంగిపోయిన స్ట్రామ్ వాటర్ మ్యాన్‌హోల్, ప్రమాదకర విద్యుత్ పోల్‌పై తక్షణ చర్యలు..



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ ప్రధాన హైవే వద్ద కమల్ వాచ్ షోరూం సమీపంలో కుంగిపోయిన స్ట్రామ్ వాటర్ మ్యాన్‌హోల్‌తో పాటు పక్కనే ఉన్న విద్యుత్ పోల్ ప్రమాదకర స్థితిలో ఉండటంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు మరియు ప్రమాదం పొంచి ఉన్న విషయాన్ని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గుర్తించారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో ఐ ఎస్ తో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుంగిపోయిన మ్యాన్‌హోల్ కారణంగా రోడ్డు భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు, పక్కనే ఉన్న విద్యుత్ పోల్ కూడా ప్రమాదకరంగా ఉండటాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు కలగకుండా తక్షణమే సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ గారు సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ, ఇంజినీరింగ్ విభాగం, హైడ్రా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అవసరమైన పనులను ప్రారంభించారు. కుంగిపోయిన స్ట్రామ్ వాటర్ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు, ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ పోల్‌ను సురక్షితంగా మార్చేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ కార్తీక్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, విద్యుత్ శాఖ లైన్మెన్ సాయి, కమలానగర్ కాలనీవాసులు సత్యనారాయణ, రోహిత్ రెడ్డి, వెంకట్, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయ గార్డెన్స్ కాలనీలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం



ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:నాగోల్ డివిజన్ పరిధిలోని విజయ గార్డెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ మరియు చిల్డ్రన్స్ పార్క్‌ను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే గారు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యం, పిల్లల ఆటలు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కాలనీ ప్రజలు తమకు అవసరమైన సౌకర్యాలను కల్పించిన ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు తూర్పటి. చిరంజీవి, శిల్పరెడ్డి, పోచంపల్లి రాజేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు రాంచంద్రరెడ్డి, మల్లారెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 48 ఏళ్ల తర్వాత కలిసిన దుండిగల్ జిల్లా పరిషత్ హైస్కూల్ 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సూరారం, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు, 25:ఆగస్టు 25: దుండిగల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1977?78 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు 48?49 ఏళ్ల తర్వాత సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. అప్పట్లో తరగతిలో మొత్తం 22 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 11 మంది పూర్వ విద్యార్థులు సమావేశానికి హాజరయ్యారు. అనివార్య కారణాల వల్ల పోలీస్ సురేందర్ రెడ్డి, కుమార్ గౌడ్, పద్మారావు, రామకృష్ణారెడ్డి తదితర ఐదుగురు హాజరు కాలేకపోయారు. తమ బ్యాచ్‌కు చెందిన కిషన్‌రావు, చక్రధర్, మైమూత్, కృష్ణ, బలరాం మృతి చెందడంపై పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. అప్పటి తరగతిలో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారిలో శ్రీనివాస్ ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎఫ్‌సీలో ఉద్యోగం చేసి స్థిరపడగా, డాక్టర్ మోహన్ ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యుడిగా సేవలందించారు. కొండల్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. తాము 10వ తరగతి చదువులో వెనుకబడినా, అనంతరం వ్యాపారాలు, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యవసాయం తదితర రంగాల్లో స్థిరపడి జీవితంలో మంచి గుర్తింపు పొందామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. తమ పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొందరి పిల్లలు విదేశాల్లో స్థిరపడటం కూడా తమకు గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ కుమారుడు కోలా శ్రీకాంత్ (సివిల్ ఇంజనీర్), వెంకటేష్ కుమారుడు కోలా అరవింద్ (డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్)తో పాటు సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా నవ్వుకున్నారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా కలుసుకోవాలని, ఈసారి హాజరు కాలేకపోయిన మిత్రులను కూడా తదుపరి సమావేశానికి తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. తదుపరి సమావేశాన్ని తాము చదువుకున్న దుండిగల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనే నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇలాంటి ఆత్మీయ సమావేశం వేల రూపాయలు ఖర్చు చేసినా దొరకని ఆనందాన్ని అందిస్తుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. డాక్టర్ మోహన్ మాట్లాడుతూ మనుమలు, మనుమరాళ్లను మంచి విద్యను అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. కొండల్‌రెడ్డి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని అన్నారు. సత్తిరెడ్డి పారిశ్రామిక రంగంలోకి ప్రవేశించి వ్యాపారాలు చేయాలని సూచించారు. శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఈ ఆత్మీయ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సమావేశాన్ని ముందుండి నిర్వహించిన కోలా రవీందర్, శేఖర్, కొండల్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ తాను ప్రస్తుతం మెడికల్ షాప్ నిర్వహిస్తున్నానని, ఉద్యోగాల కంటే వ్యాపారం ద్వారా మరిన్ని అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. సమావేశ నిర్వాహకుడు కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తాము చదువులో కొంత వెనుకబడి ఉన్నప్పటికీ సమాజంలో వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ రంగాల్లో మంచి గుర్తింపు సాధించామని అన్నారు. తమ పిల్లలకు ఉన్నత విద్య అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కొందరి పిల్లలు విదేశాల్లో సైతం స్థిరపడటం తమకు గర్వకారణమని, అందుకు తల్లిదండ్రులతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల ఆశీర్వాదం కూడా కారణమని పేర్కొన్నారు. "నేను ఇప్పటికీ మా అమ్మానాన్నల వద్దనే ఉన్నాను" అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను రవీందర్ గుర్తుచేసుకున్నారు. 48?49 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నవ్వులు, జ్ఞాపకాలు, ఆప్యాయతల మధ్య సాగి అందరినీ భావోద్వేగానికి గురిచేసింది.

## నిర్దోషిని కాపాడిన హెడ్ కానిస్టేబుల్ రంగన్నకు అవార్డు



కాప్రా, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 25:నిర్దోషికి శిక్ష పడకుండా నిజాలను వెలికితీసిన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కురువ పూజారి రంగన్నకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ ఉత్తమ అవార్డు అందజేశారు. ఓ బాలిక చేసిన తప్పుడు ఆరోపణల ఆధారంగా ఓ నిర్దోషిని కేసులో ఇరికించే ప్రయత్నాన్ని రంగన్న తన దర్యాప్తుతో అడ్డుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా కుషాయిగూడ నుంచి కీసరగుట్ట వరకు దర్యాప్తు చేపట్టి అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు. నేరస్తులను పట్టుకోవడంతో పాటు నిర్దోషులను కాపాడటం కూడా పోలీసుల బాధ్యతేనని కమిషనర్ సుమతి పేర్కొంటూ రంగన్న దర్యాప్తు నైపుణ్యాన్ని అభినందించారు. గతంలోనూ పలు కేసుల దర్యాప్తులో రంగన్న కీలకంగా వ్యవహరించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, నిపుణులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసేందుకు హైడ్రా సిద్ధంగా ఉందని తెలిపారు.

**మట్టి విగ్రహాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ**

పర్యావరణహితమైన నగర నిర్మాణంలో ప్రభుత్వం చూపుతున్న చొరవలో భాగంగానే హైడ్రా ఏర్పాటు జరిగిందని, అదే స్ఫూర్తితో మట్టి విగ్రహాల వినియోగంపైనా అందరూ దృష్టి సారించాలని నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలు, మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శివనేత మాట్లాడుతూ.. ఒక్క రూపాయికే మట్టి గణేష్ విగ్రహాలను అందిస్తున్నామని తెలిపారు. హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువులు పర్యావరణహితంగా మారుతున్నాయని, వాటి పరిరక్షణకు మన పండుగలు కూడా తోడ్పడాలని అన్నారు. సురక్ష సేవా సంఘం ప్రతినిధి గోపీ శంకర్‌తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయభాస్కర్, విష్ణు, లలిత్ కుమార్ నేత, శ్రీనివాస్, అశోక్, సుధీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొని మట్టి విగ్రహాల వినియోగానికి ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి ..

## "ప్రజల భూములను 22-ఏలో నిషేధిస్తే.. ప్రజలు నిన్ను నిషేధిస్తారు!

శిక్షించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. భూభారతి సాక్షిగా ఈ అక్రమాలు జరుగుతున్నాయి. 2023 డిసెంబర్ నుంచి 22-ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన సర్వే నంబర్లపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని ఆయన అన్నారు. తప్పు చేయలేదని ప్రభుత్వం చెబుతున్నట్లయితే, సంబంధిత శాఖ బాధ్యత వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి .. మీ తప్పు లేకపోతే వెంటనే పొంగులేటిని బర్తరఫ్ చేయండి" అని హరీష్ రావు సవాల్ చేశారు. మీకు రియల్ ఎస్టేట్ తెలుసు అంటే.. మాకు పోరాటాలు తెలుసు... ప్రజల పక్షాన ఎలా పోరాడాలో మాకు తెలుసు" అని హరీష్ రావు స్పష్టం చేశారు. 22- ఏ బాధితుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 7వ తేదీలోగా లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తాం. అసెంబ్లీలో కొట్లాడుతాం.. బయట బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతాయి. ప్రజలకు కంటికి రెప్పలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది" అని హరీష్ రావు అన్నారు. రేపు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బాధ్యులను గుర్తించి శిక్షిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భూములపై కన్నేస్తే సహించేది లేదు.. ప్రజల హక్కులను హరిస్తే పోరాటం ఆపేది లేదుఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం

# లక్ష్మీబాయి పేరు పెట్టాలి



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలను ముందుండి నడిపించి, ఎన్నోసార్లు జైలు జీవితం గడిపిన స్వాతంత్ర్య సమరయోధురాలు సంగం లక్ష్మీబాయి పేరును సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి పెట్టాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మాలక్‌పేట ఫైర్‌స్టేషన్, చంచల్‌గూడ జైలు నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా సంతోష్‌నగర్ చౌరస్తా వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి సైదాబాద్‌కు చెందిన సంగం లక్ష్మీబాయి పేరు పెట్టడం సముచితమని ఆయన అన్నారు.మాతృభూమి విముక్తి కోసం పోరాడిన సంగం లక్ష్మీబాయి.. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారని, 1930లో మహాత్మా గాంధీ పిలుపు మేరకు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారని వినయ్ కిషోర్ యాదవ్ తెలిపారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఏడాది పాటు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు.నిజాం వ్యతిరేక పోరాటంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారని, లోక్‌సభకు మూడుసార్లు ఎన్నికైన తొలి మహిళల్లో ఒకరైన ఆమె హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికై డిప్యూటీ విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, ఏపీ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీల్లో వివిధ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.ఆమె స్థాపించిన ఇందిరా సేవా సదన్ అనాథ శరణాలయానికి జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ సహకారం అందించారని వినయ్ కిషోర్ యాదవ్ పేర్కొన్నారు.సంగం లక్ష్మీబాయి సేవలను గుర్తిస్తూ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టాలని కోరుతూ త్వరలో ముఖ్యమంత్రి



రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా మాలక్‌పేట, యాకుత్‌పురా ప్రాంతాల ప్రజలు, బస్తీ వాసులు, కాలనీ సంక్షేమ సంఘాలు కోరుతున్న నేపథ్యంలో సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా తెలుగుదేశం పార్టీ

# కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

**పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా ? మంత్రి సవిత**

**రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరు పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేసిన మంత్రి**

**కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కుటుంబాలే మా బాధ్యత: మంత్రి సవిత**



జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అనంతపురం రొద్దం: సత్యసాయిజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి, వారి కుటుంబాల భద్రతకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉ ంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవిత తెలిపారు.రొద్దం మండలం కొగిర గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బోయ ఆంజనేయులు సుమారు ఐదు నెలల క్రితం ప్రమాదవశాత్తు జరిగిన బైక్ ప్రమాదంలో మృతి చెందారు. పార్టీ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద బీమా ప్రయోజనం కింద ఆయన కుటుంబానికి రూ.5 లక్షల బీమా మొత్తం మంజూరైంది.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ కొగిర గ్రామంలోని ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ తరపున మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమాకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.మంత్రి సవిత మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల ప్రమాద బీమా అందించేలా శ్రీ నారా లోకేష్ కృషితో ఈ సౌకర్యం అమలులోకి వచ్చిందని తెలిపారు.పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను, వారి కుటుంబాలను కష్టకాలంలో ఆదుకోవడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు.కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచే పార్టీ



తెలుగుదేశం పార్టీ. కార్యకర్తను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ప్రతి సందర్భంలో కుటుంబ సభ్యుడిగా భావించి ఆదుకుంటాం. కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించడమే మా బాధ్యత”×× అని మంత్రి సవిత స్పష్టం చేశారు.ఆంజనేయులు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీ సభ్యత్వం ద్వారా లభిస్తున్న ఈ ప్రమాద బీమా ప్రయోజనాన్ని ప్రతి కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవితమ్మ సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాలకు గుర్తింపు కార్డులు

## మంజూరు చేయించిన మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు



జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి: అనంతపురంపరిగి మండలానికి చెందిన కొంతమంది మత్స్యకార కుటుంబాలకు సభ్యత్వ కార్డులు లేకపోవడంతో వారు ఎదుర్కొంటున్న సమస్యను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లారు.వారి సమస్యపై స్పందించిన మంత్రి సవితమ్మ సంబంధిత అధికారులతో మాట్లాడి, అర్హులైన మత్స్యకార కుటుంబాలకు గుర్తింపు కార్డులు మంజూరు అయ్యేలా ప్రత్యేకంగా కృషి చేశారు.గుర్తింపు కార్డులు మంజూరు కావడంతో సంతోషం వ్యక్తం చేసిన మత్స్యకార కుటుంబాలు నేడు పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితమ్మ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల సమస్యను పరిష్కరించి తమకు గుర్తింపు కల్పించిన మంత్రి సవితమ్మ కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

### గ్రామపంచాయతీ కార్మికుల

# సమస్యలను పరిష్కరించాలి

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్**



కరీంనగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున జిల్లా కలెక్టరేట్ ముందు గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పల్లె సీమల్లో పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజలకు అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పంచా యతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు అందర్నీ రెండవ పిఆర్సిలో గుర్తించి కనీస వేతనం నెలకు 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దుచేసి కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని కోరారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికులందరికీ ప్రతి నెల ఒకటో తారీకు అకౌంట్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. వయసు పైబడి, అనారోగ్యం పాలైన మరణించిన కార్మికుల స్థానంలోవారి కుటుంబసభ్యులకు పని కల్పించాలని, ఆన్లైన్లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేసి పర్మినెంట్ చేయాల న్నారు. గ్రామాల్లో కొందరు సర్పంచులు తమ ఇష్టం వచ్చినట్లు కార్మికులను తొలగిస్తున్నారని ప్రభుత్వం స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. మరణించిన కార్మికుల దాన సంస్కారాలకు కనీసం తక్షణ సహాయం 30 వేలు అందించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల్లో నూటికి 90% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వారే పని చేస్తున్నారని, వీరి పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడం శోచనీయమన్నారు. రాష్ట్ర సర్కార్ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు డి నరేష్ పటేల్ ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది

**:- మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి తీవ్ర ఆగ్రహం**



ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 25:రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలో నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన ఫీజు బకాయి – బిజెపి లడాయి 48 గంటల నిరాహార దీక్షా శిబిరానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తో కలసి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందని



ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో విద్యాసంస్థలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీనివల్ల సుమారు 40 లక్షల మంది విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలు కోల్పోతూ తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, చేనేత మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ రఘురాం నేత, పార్టీ సీనియర్ నాయకులు రవి శంకర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి,ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, నాయకులు శంకరయ్య గౌడ్, కిషోర కుమార్, తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.

**పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి.**

**మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు.:: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్, జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 25:పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ జో.జి , డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి తో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు .19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి .60.83 %.శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినిలు అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కరాటేలో మృతిక మెరుపులు..

# రెండు పతకాలతో ఛాంపియన్!

**అంతర్జాతీయ వేదికపై అదరగొట్టిన 10 ఏళ్ల చిన్నారి.. రజతం, కాంస్యంతో సత్తా చాటిన హైదరాబాద్ విద్యార్థిని శివమొగ్గలో జరిగిన ఏడో అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ.. చిన్నారి విజయంపై కుటుంబసభ్యులు, పాఠశాల యాజమాన్యం హర్షం**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు, 25:చిన్న వయసులోనే కరాటేలో సత్తా చాటుతూ అంతర్జాతీయ వేదికపై హైదరాబాద్ పేరు మార్మోగేలా చేసింది పది సంవత్సరాల చిన్నారి లింగాల మృతిక. కఠోర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పోటీపడి ఏకంగా రెండు విభాగాల్లో పతకాలు సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. చిన్నారి ప్రతిభను చూసి కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, కోచ్, స్నేహితులు అభినందనలతో ముంచెత్తారు.కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 22, 23 తేదీల్లో ఏడో అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో హైదరాబాద్ బడంగ్‌పేట్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినిలింగాలమృతికతన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించింది.

**రెండు విభాగాలు.. రెండు పతకాలు**

మృతిక కరాటే పోటీల్లో రెండు విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచింది. తన ప్రత్యర్థులకు దీటుగా పోటీపడి ఒక విభాగంలో రజత పతకం, మరో విభాగంలో కాంస్య పతకం సాధించింది. రెండు పతకాలు కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలవడం ద్వారా తన ప్రతిభను మరోసారి నిరూపించింది.చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. క్రీడలపై ఆసక్తితో పాటు నిరంతర సాధన ఉంటే చిన్నారులు ఏ స్థాయిలోనైనా రాణించగలరనడానికి మృతిక విజయం నిదర్శనమని పేర్కొన్నారు.

**కోచ్ లక్ష్మీకాంత్‌కు తల్లిదండ్రుల కృతజ్ఞతలు**

మృతిక ఈ స్థాయికి చేరుకోవడంలో కరాటే కోచ్ లక్ష్మీకాంత్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని ఆమె తల్లిదండ్రులు లింగాల రాజేంద్రప్రసాద్, లింగాల స్రవంతి తెలిపారు. కఠినమైన సాధనతో పాటు పోటీల్లో ఎలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలో కోచ్ లక్ష్మీకాంత్ అందించిన శిక్షణ మృతికకు ఎంతో ఉపయోగపడిందన్నారు. రెండు పతకాలు సాధించేలా విశేషంగా కృషి చేసిన కోచ్ లక్ష్మీకాంత్‌కు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**క్రీడలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యానికి అభినందనలు**

విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్, బడంగ్‌పేట్ యాజమాన్యానికి మృతిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. మృతిక విజయం పాఠశాలకు కూడా గర్వకారణమని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**కుటుంబంలో ఆనందోత్సాహాలు**

మృతిక అంతర్జాతీయ కరాటే పోటీల్లో రెండు పతకాలు సాధించడంతో కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆమె తల్లిదండ్రులు లింగాల రాజేంద్రప్రసాద్, లింగాల స్రవంతి, అక్క మృతిలిక మృతికను హృదయపూర్వకంగా అభినందించారు. అలాగే మృతిక తాత సత్యనారాయణ, అమ్మమ్మ సత్యమ్మ, మామ సంతోష్‌కుమార్, అత్త రజిని, అఖిల్‌కుమార్ తదితరులు చిన్నారి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

**మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్ష**

పది సంవత్సరాల వయసులోనే అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రెండు పతకాలు సాధించిన మృతిక భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కుటుంబసభ్యులు ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో మరింత కఠినంగా సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, హైదరాబాద్‌కు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు కోరుకున్నారు.చిన్నారి మృతిక సాధించినవిజయం కేవలంరెండు పతకాలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో అంతర్జాతీయ క్రీడా వేదికపై మరింత ఉన్నతంగా రాణించేందుకు తొలి మెట్టుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

# ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు

***- సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్***

***- సమస్యల సాధన కోసం ప్రారంభమైన నిరసన దీక్ష శిబిరం***



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ హెచ్చరించారు. పెంచిన భారాన్ని తగ్గించాలని ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం అంగీకరించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక బడ్జెట్ను కేటాయించాలని కోరుతూ కొత్తగూడెం డిపో నందు మంగళవారం స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూ ఎఫ్) సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష శిబిరాన్ని చేపట్టారు. ఈ దీక్ష శిబిరాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎస్డబ్ల్యుఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి దశల వారి ఉద్యమాలు చేపట్టడం వల్ల కనీస స్థాయిలో ఆర్టీసీ సంస్థను రక్షించుకోవడం జరుగుతుందన్నారు. రోజురోజుకు సమస్యలు పెరిగిపోతూ ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సంవత్సర కాలంలో సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకత్వంలో పలుమార్లు సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఏమాత్రం కార్మికుల పట్ల ప్రేమ లేకుండా తన ఇష్టానుసారం వచ్చినట్లు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నిరసనగా ఆర్టీసీ సంఘాల నాయకత్వంలో సమ్మెకు సిద్ధమవడం జరిగిందన్నారు. 17 రకాల అంశాలతో సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం తరపున సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.పే స్కేలు ఏరియర్స్ ఉద్యోగ భద్రత రిక్రూట్మెంట్ ప్రమోషన్స్ తదితర డిమాండ్ల సాధన కోసం కనీస అవసరాలు తీర్చాలని కార్మికుల కోరుతున్నప్పటికీ పాలకవర్గం ఆర్టిసి యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్య పద్ధతికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో కార్మిక సంఘాలు లేవని సమస్యలు అంతకంటే లేవని సంఘం పెట్టి ధర్నా చేస్తే ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వనీకి కార్మికులు తగిన గుణపాఠం చెప్పి గద్దె దింపిన చరిత్రను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఏరియర్స్ పే స్కేలు అన్ని అమలు చేస్తామని రిక్రూట్మెంట్ కూడా చేస్తామని చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దనెక్కి మాటలు మార్చి కార్మికుల మోసం చేయడం కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. తక్షణమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు కార్మికవర్గ సంక్షేమం కోసం పెట్టిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేసి పోరాటాలను కొనసాగిస్తామన్నారు.సిపిఎం సంఘీభావం...ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం సంఘీభావం తెలిపింది. సిపిఎం 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి మాట్లాడుతూ ఎస్డబ్ల్యుఎఫ్ చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కార్మిక వర్గానికి అన్ని విధాలుగా నష్టం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతుందన్నారు. భవిష్యత్తు పోరాటాలకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరోక్షంగా ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. డిపో అధ్యక్షులు బత్తుల నాగేశ్వరావు మాట్లాడుతూ అంగీకరించిన అంశాలను కూడా ఆర్టీసీ మేనేజ్మెంట్ ఆటంకం కలిగిస్తుందన్నారు. తక్షణమే ఆ అంశాలను అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి ఇసనపల్లి శామ్యూల్ మాట్లాడుతూ సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేసి ఏడు సంవత్సరాల తర్వాత ప్రభుత్వ చొరవతో యాజమాన్యం చర్చలు నిర్వహించి అంగీకరించిన అంశాలు కూడా అమలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని అన్నారు. అంగీకరించిన అంశాలు కార్మిక సంఘాలతో చర్చించి పెంచిన పనిభారాలు తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎస్ కే రఫీ, ఇసనపల్లి యాకోబు, పి.రామకృష్ణ, బి.రామకృష్ణ, పి.శ్రీనివాస్,పి.బాబు, ధనరాజ్, ఇర్షా ఆలీ, రామ్ మూర్తి, లోకరక్షకుడు, కేశవరావు, మహిళ ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు మోహిని, కరుణ, సబిత దీక్ష శిబిరన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి లిక్కిం బాలరాజ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు గడల నరసింహారావు, కొత్తపల్లి రమేష్ బాబు, సిఐటియు నాయకులు బాలకృష్ణ నసూర్, ప్రముఖ ఐలు జిల్లా నాయకులు న్యాయవాదులు కే.పుల్లయ్య, శ్రీనివాస్ ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్ లక్ష్మి, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**- హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**




భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):విద్యారంగాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం మొహమ్మద్ రజబ్ అలీ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. షాహిద్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బకాయిలు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఏఎన్ఎంలు, వర్కర్లను పూర్తిస్థాయిలో నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, 27 పాఠశాలలను మూసివేయడం వేలాది పాఠశాలలను కుదించే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను స్కిల్ యూనివర్సిటీలకు అనుసంధానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు చేపడుతున్న శాంతియుత ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. విద్యారంగ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించకపోతే విద్యార్థులను ఏకం చేసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, మర్మం ఉమామహేశ్వర్, నాయకులు హాసిని, శ్యామల, స్వరాంజలి తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను పెంచండి స్వచ్ఛమైన ఆక్సిజన్

**– ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రకాశం స్టేడియంలో మంగళవారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పలువురు వాకర్స్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.మొక్కను నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాదని దానిని సంరక్షించడం మన సామాజిక బాధ్యత అన్నారు. పట్టణాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం వాతావరణ మార్పులు ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ప్రతి విద్యాసంస్థ ప్రతి సంస్థ కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి బాధ్యతను తీసుకుంటే పచ్చని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు మనం అందించే విలువైన బహుమతి అని వారు పేర్కొన్నారు. ప్రకాశం స్టేడియం పరిసరాలను మరింత పచ్చగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ పాల్గొని మొక్కల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యం.ఎస్. ఫణి, సెక్రటరీ మైనేని మోహన్ రావు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బత్తుల కృష్ణయ్య, ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ పి.వెంకటేశ్వర్ రావు, ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్యతో పాటు పలువురు వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు.

### రూ.47 లక్షల పంచాయతీ నిధుల దుర్వినియోగం కేసు

# వైకాపా నేత కోటిరెడ్డి దంపతుల అరెస్ట్



పల్నాడు జ్యోతి ప్రభంజనం,పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ల పంచాయతీలో రూ.47 లక్షల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో మాజీ సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, ఆమె భర్త, వైకాపా నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అవకతవకలపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో విచారణ జరిపి నిధుల దుర్వినియోగాన్ని నిర్ధారించారు. కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేయగా, గత నెల 19 నుంచి పరారీలో ఉన్న ఈ దంపతులు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. తాజాగా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501**, PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**